నేడు విద్యుత్
ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 4: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గగన్‌పహాడ్, గోల్డ్ డ్రాప్, ఆర్ఐసీ, శాతంరాయి, మెట్రో మాల్ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గగన్‌పహాడ్ ప్రధాన రహదారి,సుచిరిండియా, పాశంబండ, ఆరాంఘర్ పరివార్ డాబా, ఆర్ఈసీ, ప్రెస్టేజ్ ప్రాంతం, వీఎన్ఆర్, పారిశ్రామికవాడ, డ్రీమ్ ఇండియా, గోల్డ్ డ్రాప్, బుద్వేల్ స్టేషన్ వెంకటేశ్వర కాలనీ, కాటేదాన్ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి..
జాతీయ మహాసభలు

హిమాయత్‌నగర్,జనవరి 4: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం రెండవ జాతీయ మహాసభలను నేటి నుంచి(ఆదివారం) ఈ నెల 7 వరకు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి నగర అధ్యక్షుడు ఆరుట్ల రాజుకుమార్,నగర ప్రధాన కార్యదర్శి కుమార్ తెలిపారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..వేలాదిమంది దళితులతో నేడు ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.6,7 తేదీల్లో ఖైరతాబాద్‌లోని మోక్ష గుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రతినిధుల సభ ఉంటుందని ఇందుల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 1000 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.ఈ మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

సన్మానం: తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్-1535 సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నిర్ర ఆనంద్‌కుమార్ ఇటీవల ఎన్నికైన సందర్భంగా శనివారం యూనియన్ నాయకులు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, బండారి నగేష్, చెన్నం శైలజ, దామెర శ్రీనివాస్, అబ్దుల్‌ఖాదర్, సలీం, బాలరాజు, సుధాకర్ తదితరులు కలిసి సన్మానించారు. ఎర్రగడ్డ, జనవరి 4:

మణికొండ మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న ది సిటిజన్ కౌన్సిల్ సభ్యులు, వివిధ కాలనీల ప్రజలు, మహిళలు

ప్రజా సమస్యలపై ..స్పందించరా..!

- మణికొండలో పేరుకుపోతున్న అపరిష్కృత సమస్యలు
- రోడ్డెక్కిన స్థానికులు
- 'ది సిటిజన్ కౌన్సిల్' ఆధ్వర్యంలో శాంతియుత నిరసన

మణికొండ,జనవరి 4 : పేరుగొప్ప..ఊరు దిబ్బ అన్నచందంగా మణికొండ మున్సిపాలిటీలో సమస్యలు తాండవిస్తున్నా అధికారుల్లో చలనం కరువైందంటూ ప్రజలంతా రోడ్లెక్కి నిరసనలు చేపడుతున్న పరిస్థితులు దాపురించాయని 'ది సిటిజన్ కౌన్సిల్' ఉప కార్యదర్శి బొమ్ము ఉపేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రజలతో కలిసి ఆయన పెద్ద ఎత్తున సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. దానిలో భాగంగా నెక్నాంపూర్ చింతచెట్టు సర్కిల్ వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కమిషనర్‌ను కలిసి తక్షణ చర్యలు చేపట్టాలంటూ విన్నవించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత, సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధి బొమ్ము ఉపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ .. నెక్నాంపూర్, పుప్పాలగూడ, మణికొండ ప్రాంతాల్లోని అన్ని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో దోమల బెడద,ట్రాఫిక్ సమస్య,గుంతలమయంగా మారిన రహదారులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని ఉపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పద్మారావు, నవీన్‌కుమార్, స్థానికులు ప్రసాద్, గణపతి రాజు, విజయభాస్కర్, సుజాత, స్వప్న, రాధిక, రూపా, అనిత, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో పలు కాలనీలల్లో కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక

మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

ఎర్రగడ్డ, జనవరి 4: ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలలో పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు హైదరాబాద్ జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వర్కాల సత్యనారాయణ, కార్యదర్శి ఆర్.మహేందర్ తెలిపారు. ఈ కార్యవర్గ సభ్యుల వివరాలను దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనితకు శనివారం అందజేశారు. మానసిక వైద్యశాల నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎండీ గౌస్, కార్యదర్శిగా ఎన్.కరుణాకర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.రాంచందర్‌లను నియమించామన్నారు. మిగితా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

జలగం వెంగళరావు పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ప్రారంభించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

బంజారాహిల్స్,జనవరి 4: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో రూ.3.54 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్ శనివారం ప్రారంభించారు. రూ.11.5లక్షల వ్యయంతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని తాజ్ కృష్ణ జంక్షన్, రూ.12.75లక్షలతో జీవీకే మాల్ జంక్షన్, రూ.1.96లక్షలతో కేబీఆర్ పార్కు జంక్షన్‌లో చేపట్టిన సుందరీకరణ పనులను వారు ప్రారంభించారు. అనంతరం జలగం వెంగళరావు పార్కులో రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..ఖైరతాబాద్ ని యోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రూ.35కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో ప్రాధాన్యత క్రమంలో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. మరో రూ.25 కోట్లు అవసరమవుతాయని, వాటికి చెందిన ప్రతిపాదనలు సైతం ప్రభుత్వానికి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి, జోన ల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీఎంసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు రాంచందర్, సారంగపాణి, జలగం వెంగళరావు పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే ధ్యేయం : అంబర్‌పేట ఎమ్మెల్యే

కాచిగూడ, జనవరి 4 : అంబర్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా, ప్రజల సహకారంతో సమస్యలను పరిష్కరిస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సమస్యలను తెలుసుకోవడానికి శనివారం కాచిగూడ డివిజన్‌లోని బండల్ బస్తీ, పరిసర ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గాల కంటే అంబర్‌పేటను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థను ఆధునీకరిస్తామని పేర్కొన్నారు. యుద్ధ ప్రతిపాదిక సత్వర చర్యలు చేపడుతూ ఐదు డివిజన్లను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు బాధ్యతగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నామని, మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎర్ర బీష్మాదేవ్, జగ్గయాదవ్, ఓం ప్రకాశ్‌యాదవ్, డాక్టర్ శిరీషాయాదవ్, శ్రీకాంత్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ..దుర్గం చెరువులో శవంగా....

ఖైరతాబాద్, జనవరి 4 : అదృశ్యమైన ఓ మహిళ...దుర్గం చెరువులో శవమై కనిపించింది. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం...ఎల్లారెడ్డిగూడ గృహశిల్పి శుభాంజలి అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉండే ఆడేపు ప్రభు సతీమణి ఆడెపు దుర్గా మాధవి ఈ నెల 2న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. బెడ్‌రూమ్‌లో ఆమె సెల్‌ఫోన్‌లో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టారు. శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం దుర్గం చెరువులో గుర్తించిన అక్కడి పోలీసులు సమాచారాన్ని పంజాగుట్ట పోలీసులకు అందించారు. మృతిచెందిన మహిళ దుర్గా మాధవి అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సనాతన ధర్మం ..ఎంతో ఉన్నతమైంది

భారతీయ సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమాజిగూడలోని రాజ్‌భవన్ సంస్కృతి భవన్‌లో అమరవాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగ్యనగర్ భారతీయ సంస్కృతి సమ్మేళనానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మం అంటే ఎప్పటికప్పుడు తమలోని విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమేనన్నారు. భారతీయ సంస్కృతి ఎంత ఉన్నతమైందో....సనాతన ధర్మం కూడా అంతే విలువైందన్నారు. ఈ కార్యక్రమంలో అమరవాణి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మధన్ మహారాజ్ గోసావి, పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి చిత్తా మహారాజ్, నిర్వాహకులు పీయూఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.
– ఖైరతాబాద్, జనవరి 4

పేదలకు ప్రభుత్వం అండగా ఉండాలి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 4: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లను అందించి వారిని ఆదుకోవాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు.
శనివారం డివిజన్ పరిధిలోని పోచమ్మ బస్తీలో ఆయన పర్యటించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తమ పేర్లు లేవని వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలుస్తూ వెంటనే పేదలకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించా లన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న పత్రాలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్

తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా–2 ఆర్యవైశ్య

అధ్యక్షులుగా శ్రీధర్, స్రవంతి

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య ఆఫీసర్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రంగారెడ్డి జిల్లా అర్బన్–2 అధ్యక్షులుగా మణికొండకు చెందిన బొడ్డు శ్రీధర్,మహిళా విభాగం అధ్యక్షురాలిగా గజ్జల స్రవంతిని నియమిస్తున్నట్లు రాష్ట్ర ఆర్యవైశ్య ఆఫీసర్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ శనివారం వెల్లడించారు. ఈ మేరకు మణికొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన బొడ్డు శ్రీధర్, గజ్జల స్రవంతిలకు నియామక పత్రాలను అందజేశారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో అవోపా అభివృద్ధి కోసం శక్తి వంచనలేకుండా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.
మణికొండ, జనవరి 4

గ్రంథాలయాల
అభివృద్ధికి కృషి

స్థానిక గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తానని నగర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కె.ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రహ్మత్‌నగర్‌లోని శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, గ్రంథ పాలకుడు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్

పనులు పరిశీలన: రహ్మత్‌నగర్ డివిజన్‌లోని వినాయక్ నగర్‌లో రూ.9.40 లక్షల వ్యయంతో చేపట్టిన సీవరేజీ పైప్‌లైన్ పనులను శనివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పరిశీలించారు. అదేవిధంగా బ్రహ్మశంకర్ నగర్‌లో ప్రమాదకరంగా మారిన కొబ్బరి చెట్టును తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. –జూబ్లీహిల్స్,జనవరి4

హైడ్రా అధికారులు వస్తే..మాకేంటి..!

- పనులు నిలిపివేయాలని సూచించినా కొనసాగుతున్న ప్రహరీ పనులు
- పట్టించుకోని అధికారులు..
- సామాన్యులకు ఓ న్యాయం..

పెద్దలకు ఓ న్యాయమా అంటు విమర్శలు

శంషాబాద్ మున్సిపాలిటీ ధర్మోజికుంట చెరువుకు ఆనుకొని చేపడుతున్న భారీ ప్రహరీగోడ

శంషాబాద్ రూరల్, జనవరి 4: మూడు రోజుల క్రితం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ధర్మోజికుంట బఫర్‌జోన్‌ను ఆక్రమించి చెరువులోకి నీరు రాకుండా భారీ ప్రహరీగోడ నిర్మాణం చేపడుతున్నట్లు తెలుసుకున్న హైడ్రా సీఐ తిరుమలేష్‌తో పాటు ఇరిగేషన్ ఏఈ మౌనికరెడ్డి, , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కలిసి పర్యటించారు. అక్కడ నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణం నిలిపివేయాలని సూచించారు. పూర్తి వివరాలు సేకరించి సదరు నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని అధికారులు మీడియాకు వివరించారు. కాని సదరు నిర్మాణదారులు మాత్రం ఎలాంటి భయం లేకుండా యాథేచ్ఛగా ప్రహరీగోడ నిర్మాణం పనులు చేపడుతున్నారు. శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 72,73,74,75,76,77లలో దాదాపు 40 ఎకరాలకు పైగా జీవో నంబర్ 111 పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ప్రహరీగోడ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో పాటు ధర్మోజికుంట బఫర్‌జోన్‌తో పాటు చెరువులోకి వచ్చే నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణం చేపట్టడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ భూమి ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే తమ్ముడి హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. అధికార పార్టీ ఎమ్మెల్యే పేరు చెప్పడంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. పేద వర్గాలకు చెందిన వారు నివాసం ఉండడానికి ఇండ్లు నిర్మాణం చేపడుతే కూల్చివేస్తున్న అధికారులు అధికార పార్టీ నేతలు ఎన్ని అక్రమ నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోవడంలేదని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి.

ఉజ్వల భవిష్యత్‌ను నిర్దేశించుకోవాలి

– ఇండియా లిటరసీ ప్రాజెక్టు స్వచ్ఛంద సంస్థ కెరీర్ గైడ్ శిల్పి మహర్షి

మణికొండ, జనవరి 4 : విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను ఎంచుకున్నప్పుడే సమాజంలో ఉన్నతశిఖరాల వైపు ఎదుగుతారని ఇండియా లిటరసీ ప్రాజెక్టు స్వచ్ఛంద సంస్థ కెరీర్ గైడ్ శిల్పి మహర్షి అన్నారు. మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదోతరగతి తర్వాత విద్యార్థులు తీసుకోవాల్సిన కోర్సులు, విద్యావకాశాలపై కెరీర్ గైడ్ శిల్పి మహర్షి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకునేలా సైకోమెట్రిక్ యాక్టివిటీ కూడా నిర్వహించారు. తమ ఉజ్వలమైన భవిష్యత్తు కోసం లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగినప్పుడే సమాజంలో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించడం సులువుగా ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ మాట్లాడుతూ

మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పిస్తున్న శిల్పి మహర్షి

ఇలాంటి అవగాహన కార్యక్రమాలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వాసు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతను ఆధ్యాత్మికతవైపు నడిపించాలి

ఖైరతాబాద్, జనవరి 4 : మద్యం, మత్తు పదార్థాలను వదిలి యువతను ఆధ్యాత్మిక చింతన వైపు నడిపించాల్సి ఉందని పలువురు మత గురువులు అభిప్రాయపడ్డారు. లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో మాదక ద్రవ్యాల ముప్పును అరికట్టడంలో ధార్మిక గురువుల పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సు ధార్మిక జనమోర్చా జాతీయ కన్వీనర్ డాక్టర్ సలీమ్ అధ్యక్షతన జరిగింది. చిలుకూరి బాలాజీ దేవాలయం అర్చకులు లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుంచే భక్తిని అలవర్చాలని, తద్వారా వయసు పెరిగిన తర్వాత వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. మద్యం, మత్తు పదార్థాలను ప్రభుత్వాలు ఎందుకు నిషేధించడం లేదని ప్రశ్నించారు. క్రైస్తవ మత ప్రబోధకుడు ఫాదర్ అనంతయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆత్మలో దేవుడుంటాడని, అలాంటి శరీరాన్ని మత్తులో ముంచడం పాపమన్నారు. జమాతే ఇస్లామి హింద్

సదస్సులో పాల్గొన్న వివిధ మతాల గురువులు

నాయకురాలు ఆస్రా మొహసినా మాట్లాడుతూ ధార్మిక గురువుల తమ ధార్మిక కలాపాలతో పాటు సామాజిక బాధ్యత కోసం సమయం కేటాయించాలన్నారు. ఈ సదస్సులో లింగాయత్ మఠం ప్రతినిధి ప్రభుదేవ స్వామిజీ, ధార్మిక జనమోర్చా రాష్ట్ర కన్వీనర్ అతీఫ్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా డ్రైనేజీల ఆధునీకరణ

మంచిరేవుల శివపురి కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న వైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ, జనవరి 4: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను అధునాతన పద్ధతిలో ఆధునీకరిస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ వైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ పేర్కొన్నారు. మంచిరేవులలో శివపురి కాలనీలో డ్రైనేజీ పైపులైన్ పనులను రూ.15 లక్షల వ్యయంతో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నాగార్జునరెడ్డి, రాంచందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించ వచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెల లోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, నా క్లయింట్లు షబాద్ సురేష్ యాదవ్ & ఇతరులు బుద్వేల్ గ్రామం, GHMC, రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నెం.431లో ఎక.1-09 గుంటలు మరియు సర్వే నెం.432లో ఎక.0-14 గుంటలు, మొత్తం ఎక.1-23 గుంటలు భూమి (డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ప్రకారం విస్తీర్ణం 7,623.00 చ.గజాలు లేదా 6,372.82 చ.మీటర్లు)కు సంబంధించి ఎల్‌బి నగర్ వద్ద గౌరవనీయ V అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్, రంగారెడ్డి జిల్లా సమక్షంలో రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ GPA డాక్యుమెంట్స్ మరియు (18) రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ రద్దు చేయు నిమిత్తం M/s శ్రీ కార్తికేయ ఇన్‌ఫ్రా & ఇతరులపై O.S.No.811 ఆఫ్ 2024 దాఖలు చేశారు మరియు సదరు దావాలో గౌరవనీయ న్యాయస్థానం I.A.No. 1284 ఆఫ్ 2024 ద్వారా 30.12.2024న యథాస్థితి ఉత్తర్వును జారీ చేసినది, అది ఇప్పటికీ అమలులో ఉంది.
అందువల్ల, సదరు సివిల్ కేసు పెండింగ్‌లో ఉన్నందున, సదరు M/s శ్రీ కార్తికేయ ఇన్‌ఫ్రా కంపెనీ & ఇతరులతో పైన తెలిపిన సదరు ఆస్తికి సంబంధించి ఏవిధమైన లావాదేవీలు కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. ఈ ప్రకటనను కాదని ఎవరేని ఏదేని లావాదేవీ కుదుర్చుకున్నచో వారు తమ స్వంత నష్టప్రూపకిత్తుపై అలా చేసినవారవుతారు మరియు సదరు ఆస్తిపై వారికి ఏవిధమైన హక్కు లేదా టైటిల్ లభించదు.